క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



ఫల్గుణరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్

రణస్థలం: జె.ఆర్.పురం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వేలిచేటి ఫల్గుణరావు, గరికిపాలెం గ్రామానికి చెందిన డాక్యుమెంట్ రైటర్ గుగ్గిలాపు చిన్నారావు ఇటీవల మరణించడంతో వారి కుటుంబాలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. కార్యక్రమంలో జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పచ్చిగుళ్ల సాయిరాం, దన్నాన సీతారాం, టేకి బ్రహ్మాజీ, పిన్నింటి సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మానవసేవకు మరోరూపం మెల్విన్ జోన్స్



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: మానవ సేవకు మరో రూపం లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెల్విన్‌జోన్స్ అని క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు హారికా ప్రసాద్ అన్నారు. నగరంలోని హారిక భవన సముదాయం వద్ద జోన్స్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ద్వారా చేపట్టబోయే సేవా కార్యక్రమాలను వివరించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఈ ఏడాది ఉచిత వైద్య సేవలకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పొన్నాడ రవికుమార్ సౌజన్యంతో పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. అనంతరం నిరుపేదలకు చీరలు, లుంగీలు, దుప్పట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వావిలపల్లి జగన్నాథనాయుడు, శోభారాణి, చింతు గణపతి, కె.హారిక, బరాటం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో వర్ధమాన నటుడు విజయ్‌శంకర్



ఆలయం వద్ద విజయ్‌శంకర్ తదితరులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని వర్ధమాన సినీ హీరో విజయ్‌శంకర్ శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం అనంతరం అనివెట్టి మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఫోకస్ అనే సినిమా ద్వారా హీరోగా పరిచయమయ్యానని, మరో సినిమాకు కూడా సైన్ చేశానని శంకర్ తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సందీప్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదా రంగనాథుల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని దీపామహల్ వెనుక శివబాలాజీ ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం గోదా రంగనాథుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీకూర్మం అర్చకులు చామర్తి జగన్నాథాచార్యులు, గోపినంబాళ్ల వేంకట సీతారామాచార్యులు, సత్యకూర్మాచార్యులు ఆధ్వర్యంలో రోజుకొక పాశుర పారాయణలతో ధనుర్మాస వ్రతాలను నిర్వహించిన భక్తులు గోదా రంగనాథుల విగ్రహాలను ఉంచి పూలతో అలంకరించి సంప్రదాయంగా విశ్వక్సేన పూజ, యజ్ఞోపవీతధారణ, మాంగల్య ధారణ, తలంబ్రాలతో కల్యాణ వేడుకలు పూర్తి చేశారు. కమిటీ సభ్యులు తులసీరావు, మహేష్‌సామంత్, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంతోషిమాతకు పూజలు



పూజలందుకుంటున్న సంతోషిమాత

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో పాలతో అభిషేకాలు చేసి పూజలు చేసి మహానివేదన, మహా హారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



వస్త్ర దుకాణంలో రద్దీ



ఫుట్‌పాత్ షాపుల వద్ద సందడి



గాజులు కొనుగోలు చేస్తున్న దృశ్యం



పాదరక్షలు కొనుగోలు చేస్తూ..

సందడే సందడి

- భోగి, సంక్రాంతి పండగలకు సర్వం సిద్ధం
- పలుచోట్ల ముందస్తు వేడుకలు



హరిదాసు కీర్తనలు

లావేరు/శ్రీకాకుళం కల్చరల్/శ్రీకాకుళం: సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. పల్లెపట్టణం అనే తేడా లేకుండా హరిదాసులు, డూడూ బసవన్నల సందడి నెలకొంది. గంగిరెద్దులను ఇంటింటా తీసుకెళ్లి పాటలు పాడించి దండాలు పెట్టించి బియ్యం, వస్త్రాలు స్వీకరించారు. కుటుంబసభ్యులు క్షేమంగా ఉండాలని దీవించారు. హరిదాసులు పాటలు పాడుతూ సందడి చేశారు.

భోగి పండగ సందడి..

శనివారం భోగి పండగ కావడంతో గ్రామాల్లోని సందడి నెలకొంది. పిల్లలకు సెలవులు కావడంతో భోగి పిడకలను సిద్ధం చేసుకున్నారు. యువత కర్రలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వేడుకలు..

లావేరు మండలం గోవిందపురం అంగన్‌వాడీ కేంద్రం, లావేరు శాఖా గ్రంథాలయాల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేసి పిండివంటలు ప్రదర్శించారు.



గోవిందపురం అంగన్‌వాడీ కేంద్రం వద్ద పిండి వంటల ప్రదర్శన

హరిదాసు వేషధారణ, కుండపై పాలు పొంగించడం, సంక్రాంతి ముగ్గులు, చిన్నారులకు పలు పోటీలు నిర్వహించారు. అంగన్‌వాడీ చిన్నారుల వేషధారణ ఆకట్టుకుంది. లావేరు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో గోవిందపురం సర్పంచ్ పిల్లా రాము, లావేరు గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీఓ సీహెచ్ ఝాన్సీరాం, సచివాలయం ఎంఎస్‌కే యమునారాణి, అంగన్‌వాడీ కార్యకర్త జి.లక్ష్మీ, ఆశ కార్యకర్త మరియమ్మ, గ్రంథాలయ సహాయకుడు ఎ.గడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.



సంప్రదాయ ముగ్గులు



లావేరు గ్రంథాలయంలో సంక్రాంతి పాటలు పాడుతున్న బాలికలు



గోవిందపురంలో భోగి మంటలు



భోగి పిడకలను చూపిస్తున్న పిల్లలు



లావేరులో గంగిరెద్దుల సందడి

దాతలు దిగి వచ్చిన వేళ..!



శ్రీకాకుళం అర్బన్: మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు



జి.సిగడాం: దివ్యాంగులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న దాతలు

శ్రీకాకుళం అర్బన్: పండగ వేళ నిరుపేదల కళ్లల్లో ఆనందం చూడటమే లక్ష్యమని చేయూత-మేమున్నాం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా శుక్రవారం శ్రీకాకుళం ఎన్‌జీవో కార్యాలయంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవాధ్యక్షుడు కోరాడ హరిగోపాల్, సంస్థ జిల్లా అధ్యక్షురాలు వైశ్యరాజు వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా నిరుపేదలకు వస్త్రాలు అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ధనలక్ష్మి, శైలజ, సంగీత, కొండబాబు, మోహన్ కృష్ణ, జయలక్ష్మి, సత్యవతి, లింగరాజు, మణిశర్మ, అరుణ, సింహాచలం, కామేశ్వరి, పూర్ణ, కల్యాణ్, బాలమణి, సింహాద్రి లక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం : మండలంలోని ఎస్.పి.ఆర్.పురంలో సర్పంచ్ కంది రమాదేవి సమక్షంలో జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు, దివ్యాంగులకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కంది సాయికిరణ్, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం కల్చరల్: వస్త్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గోవిందనగర్‌కాలనీలో డాక్టర్ నాయుడు ట్రస్ట్ అధ్యక్షులు సనపల సత్యవతి ఆర్థిక సాయంతో శుక్రవారం పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 19వ డివిజన్ నాయకులు బొర్లంగి రామ్మోహనరావు, హనుమంతు ఆర్య తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం: బలగ సమీపంలో నివాసముంటున్న ఇద్దరు వ్యక్తులు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో కేసు నమోదు చేశామని సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. ఇళ్ల మధ్య సందు విషయమై తరచూ గొడవపడే వీరు శుక్రవారం కూడా తగదాపడ్డారు. అనంతరం శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేయడం కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

లావేరు ఎంపీడీఓగా సురేష్‌కుమార్



సురేష్‌కుమార్

లావేరు: స్థానిక ఎంపీడీఓగా కుప్పిలి సురేష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన ఆర్.స్వరూపారాణికి పదోన్నతి రావడంతో బదిలీ అయ్యారు. మండల పంచాయతీ అధికారి వి.విశ్వేశ్వరరావు ఇంతవరకూ ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేశారు. తాగాజ బూర్జ మండలం ఎంపీడీఓగా పనిచేస్తున్న సురేష్‌కుమార్‌ను లావేరు మండలానికి డిప్యూటేషన్‌పై నియమించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ సూపరింటెండెంట్ సునీత, ఎస్‌ఏ మాధవరావు, జేఏ భాను, కార్యాలయం సిబ్బంది ఎంపీడీఓను మర్యాద పూర్వకంగా కలిశారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



పప్పు వంటకాలను పరిశీలిస్తున్న పౌరసరఫరాల మేనేజర్ జయంతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: అరసవల్లిలోని శ్రీశయన వీధి అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా పౌర సరఫరాల మేనేజర్ పి.జయంతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన కంది పప్పు పరిశీలనలో భాగంగా పలు కేంద్రాలకు వెళ్లి నాణ్యతను పరిశీలించారు. పౌర సరఫరాల సంస్థ ద్వారా అందిస్తున్న కందిపప్పు రుచికరంగా ఉందని, నాణ్యత బాగుందని, పప్పుతో చేసిన వంటకాలను పిల్లలు ఇష్టంగా తింటున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, సివిల్ సప్లయ్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి ధర్మానను కలిసిన ఆఫ్‌షోర్ నిర్వాసితులు



వినతిపత్రం పరిశీలిస్తున్న మంత్రి ధర్మాన

శ్రీకాకుళం రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మెళియాపుట్టి మండలం చీపురుపల్లి పంచాయతీ పరిధిలో సుమారు రెండు వందల మంది నిర్వాసితులు సిరిపురం తేజేశ్వరరావు ఆధ్వర్యంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు వల్ల తమ గ్రామాల్లో ఉన్న భూమి, ఇళ్లు, సర్వం కోల్పోయామన్నారు. గత టీడీపీ హయాంలో పల్లం భూమికి రూ.2,25,000, మెట్టభూమికి రూ.1,80,000 ప్యాకేజీ ఇచ్చారని తెలిపారు. ఈ ప్యాకేజీ చాలామందికి అందలేదన్నారు. 350 మందికి ఇళ్ల స్థలం కూడా ఇవ్వలేదని చెప్పారు. ఆఫ్‌షోర్ పూర్తయ్యేవరకూ 18 ఏళ్లు నిండిన వారికి కూడా ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. అనంతరం మంత్రి స్పందిస్తూ వచ్చే నెలలో కలెక్టర్ సమీక్ష సమావేశం ఉందని, విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్తానని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో ప్రెసిడెంట్ యవ్వారి ఈశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ పిట్ట సవరయ్య, తెప్ప శ్యామసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. సంక్రాంతి సంబరాల సందర్భంగా కొండములగాంలో సర్పంచ్ గొర్లె మంజులాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్, క్రికెట్ టోర్నమెంట్లను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సెలవుల్లో సొంత ఊళ్లకు వచ్చే గ్రామస్తులకు క్రీడలు చక్కటి వినోదం అందిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె అప్పలనాయుడు, గొర్లె చైతన్య, జరుగుళ్ల శంకరరావు, కలిశెట్టి కన్నంనాయుడు, కేవివి సత్యనారాయణ, గొర్లె వెంకటరమణ, మజ్జి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా జగనన్న గృహ నిర్మాణాలు



సిమెంట్ గోదాంలో రికార్డులు పరిశీలిస్తున్న ఈఈ మోహనరావు

జి.సిగడాం: జగనన్న గృహ నిర్మాణ పనులు శరవేగంతో జరుగుతున్నాయని గృహ నిర్మాణ శాఖ ఈఈ పి.జి.జె.మోహనరావు అన్నారు. శుక్రవారం జి.సిగడాంలోని సిమెంట్ గోదామును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నామని చెప్పారు. లబ్ధిదారులకు సిమెంట్ కొరత లేకుండా సరఫరా చేస్తున్నామన్నారు. పనుల వివరాలను ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో నమోదు చేసి నివేదిక పంపించాలన్నారు. గృహ నిర్మాణ పనుల్లో ప్రథమ స్థానంలో ఉండేలా మండల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఈ మహదాస్యం రమేష్, బొల్లంగి యువరాజు, శ్రీనివాసరావు, వెలది సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పవన్‌వి దిగజారుడు రాజకీయాలు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రణస్థలం: జనసేన అధినేత పవన్ కల్యాణ్ యువశక్తి సభలో ఏం మాట్లాడారో ఆయనకే తెలియదని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ ఎద్దేవా చేశారు. రణస్థలంలోని ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ వచ్చిన తర్వాతే ఉద్దానం ప్రాంతానికి రూ.750 కోట్లతో శుద్ధజలం ప్లాంట్, రూ.50 కోట్లతో కిడ్నీ రీసెర్చి సెంటర్, డయాలసిస్ పింఛన్ రూ.10 వేలు అందజేస్తున్నారని గుర్తు చేశారు. మత్స్యకారులకు వైఎస్సార్ మత్స్యభరోసా కింద రూ.10 వేలు అందజేస్తున్నారని చెప్పారు. ఇదంతా పవన్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు ప్యాకేజీ కోసం మంత్రులను తిడితే ఓట్లు రావని తెలుసుకోవాలని హితవుపలికారు. జనసేన అభిమానులే ఓట్లు వేయడం లేదని చెబుతున్నావంటే మీ స్థాయి ఏంటో ప్రజలకు అర్థమవుతోందన్నారు. పవన్ కల్యాణ్‌వి దిగజారుడు రాజకీయాలని విమర్శించారు. సమావేశంలో జెడ్పీటీసీ టొంపల సీతారాం, వైఎస్సార్‌సీపీ నాయకులు లంకలపల్లి ప్రసాద్, మహంతి పెదరామినాయుడు, జరుగుళ్ల శంకరరావు, కేవీవీ సత్యనారాయణ, బడి రాంబాబు, జక్కంపూడి బంగార్రాజు, కెల్ల రమణ, పందువాడు తదితరులు పాల్గొన్నారు.

13652 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



సలహా మండలి సమావేశంలో చర్చిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం రూరల్: మండలంలో ఇప్పటి వరకు 13652.76 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి తెలిపారు. శుక్రవారం ఎంపీపీ అంబటి నిర్మలా శ్రీనివాస్ అధ్యక్షతన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ 3317 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశామన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ద్వారానే ధాన్యం కొనుగోలు



సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న సాయికుమార్

రణస్థలం: రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు వేగవంతం చేస్తున్నామని రణస్థలం వ్యవసాయ అదనపు సంచాలకుడు వడ్డాది శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ మాట్లాడుతూ రైతులకు పురుగు మందులను రాయితీపై అందజేయాలని కోరారు. సబ్సిడీపై మోటార్లు పంపుసెట్లు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు మేలు చేకూరే పలు అంశాలపై చర్చించి తీర్మానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ టొంపల సీతారాం, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పైడి శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు చిల్లా వెంకటరెడ్డి, సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రైతులందరికీ పథకాలు చేరాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి తదితరులు

ఎచ్చెర్ల క్యాంపస్: రైతులందరికీ ప్రభుత్వ పథకాలు చేరాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు.

ఈ-క్రాప్, వెబ్‌ల్యాండ్‌లో రైతుల పేర్లు నమోదు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు, నారాయణపురం శివారు భూములకు సాగునీరు, తోటపాలెం ఎత్తిపోతల పథకం నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అర్హులైన రైతుల భూముల్లో వైఎస్సార్ జలకళ ద్వారా బోర్లు తవ్వించాలన్నారు. పీఏసీఎస్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సలహా మండలి అధ్యక్షుడు బొడ్డేపల్లి సుధాకర్, వ్యవసాయ శాఖ ఏడీ రజని, ఎంపీడీఓ కుమార్ పట్నాయక్, ఏఓ సురేష్, ఎలక్ట్రికల్ ఏఈ హరికృష్ణ, డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.